



# నీ కోసం ఈ లోకం

‘అవును, నేను చచ్చిపోవడమే మంచిది’ అనుకున్నాడు సుబ్బారావు మళ్ళీ. ఎలా చచ్చిపోతే బావుంటుంది? చచ్చిపోవడానికి బాగేమిటి? ఓగేమిటి? అనుకుని సుబ్బారావు జగదాంబ జంక్షన్ దగ్గరకొచ్చాడు.

సాయంత్రం నాలుగు గంటలయినా ఎండవేడి ఇంకా తగ్గలేదు. సుబ్బారావుకు ఉక్కగా ఉంది. ఎంతో తిక్కగా వుంది. అతని మెదడును ఆలోచనలు తొలిచేస్తున్నాయి.

ఎంత కష్టపడి చదివాడు తను. డిగ్రీ పూర్తి చేయడానికి ఎన్ని తిప్పలుపడ్డాడు. అంతా బూడిదలో పోసిన పన్నీరయింది. అసలు డిగ్రీ పూర్తయిన నాలుగేళ్ళ దాకా ఇంటర్వ్యూనే లేదు. తర్వాత వచ్చిన ఇంటర్వ్యూలు తనను ఎన్నో వూళ్ళు తిప్పాయి. ఎంతో డబ్బును తిన్నాయి, ఉద్యోగం మాత్రం రాలేదు. ఇవ్వాల్టి ఇంటర్వ్యూ మీద తను ఎంతో ఆశపెట్టుకున్నాడు. ఇదీ అడియాసే అయ్యింది. ఈ ఇంటర్వ్యూకు రావడం కోసం నాన్న ఎన్నో తంటాలుపడి డబ్బు తెచ్చి యిచ్చాడు. చిన్నప్పుడే అమ్మ చనిపోయినా, నాన్న తనకోసం మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు.తనను చదివించే స్తోమత లేకపోయినా అష్టకష్టాలు పడి చదివించాడు. ఉన్న రెండెకరాల పొలం అమ్మేశాడు. తనుకూడా ఏ సంవత్సరమూ పరీక్ష తప్పకుండా శ్రద్ధగా చదివాడు. మంచి మార్కులతో డిగ్రీ సంపాదించాడు. చివరకు మిగిలిందేమిటి? అసమర్థుడనే పేరు. ఆపైన ఇంటర్వ్యూల ఇరకాటాల జోరుకు నీరుకారి పోవడం. బస్ హారన్ విని సుబ్బారావు ఒక్కసారి తుళ్ళిపడ్డాడు. గబుక్కున పక్కకు తప్పుకున్నాడు.

'ఏం గురూ, ఇంటి దగ్గర చెప్పిరాలేదా బస్సు డ్రయివర్ తల బయటకుపెట్టి సుబ్బారావుతో అని, గేరుమార్చి బస్సును ముందుకుపోనిచ్చాడు. సుబ్బారావు గుండె దడదడ లాడింది. తన భయానికి నవ్వుకున్నాడు. ఇవేళ తనెలాగూ చచ్చిపోయి తీరతాడు. అది ఇప్పుడే జరిగివుంటే ఎంతబావుండును. తనకు ఈ అదృష్టం కూడా కలగలేదు. సుబ్బారావు ఒండినిండా చెమటలు పట్టేశాయి. చొక్కా వొంటికి అంటుకుపోయింది. సుబ్బారావు కలెక్టరాఫీసు దగ్గరకొచ్చాడు. సూర్యుడింకా శాంతించలేదు. అతనికి నాలాగే అశాంతిగా వుందేమో అనుకున్నాడు సుబ్బారావు.

రామకృష్ణ బీచ్‌వైపు నడిచాడు సుబ్బారావు. ఆ డౌన్‌లో నడుస్తుంటే చిన్నప్పుడు తను సీమచింతచెట్టు నుంచి కిందకు దిగటం గుర్తొచ్చింది. చిన్నతనంలోని తీయదనం ఇప్పుడేది?. ఏ రాక్షసుడు దానిని కబళించాడు? ఉదయం స్కూలు విడిచిపెట్టగానే తోటి పిల్లలతో తను ఉలవపేటలోని సీమచింత చెట్ల దగ్గరకు పరుగెట్టుకుని వెళ్ళిపోయేవాడు. చెట్టెక్కి సీమచింతకాలు కోసుకుని, కొమ్మల మీద కూర్చుని తినేవాడు. ముళ్ళు గుచ్చుకున్నా లెక్కనిపించేదికాదు. తర్వాత కోనేటి గట్టుకువెళ్ళి స్నేహితులతో ఆటలాడేవాడు. అలసిపోయేక, కోనేట్లో స్నానాలాడేవాడు. ఒకనాడు, చెరువుగట్టుమీద వదిలిన తమ బట్టల్ని సత్తియ్య కాపు గుడిలో దాచేసినప్పుడు తామెంత కంగారు పడ్డారు. బోసిమొలల్తో అతనిదగ్గరకెళ్ళి తమ బట్టలియ్యమని బతిమాలారు. ఇంకెప్పుడూ మిట్ట మధ్యాహ్నం కోనేట్లో స్నానం చేయం అని అంటేనే బట్టలిస్తానన్నాడు. అతను చెప్పినట్టే చేశారు. అప్పుడు యిచ్చాడు బట్టలు. అవి వేసుకుని ఇంటికి ఒకటే పరుగు. తను పుట్టి పెరిగిన పచ్చని పల్లెటూరికి తనకీ నేటితో రుణం తీరిపోతుంది.

'అబ్బా' అన్నాడు సుబ్బారావు, బీచ్‌పక్క ప్లాట్ ఫారమ్ మీది రాయి అతని కాలిబొటనవేలుకు తగిలింది. గోరు చిట్లి కొద్దిగా రక్తం వచ్చింది. కొంచెం ఇసుకతీసి, గాయం అయినచోట అద్ది, సుబ్బారావు నడిచాడు. సముద్రం వంక చూశాడు. రెండు మూడు ఓడలు ఇంటర్వ్యూ పిలుపుకోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల్లావున్నాయి. అవి ఇవాళ కాకపోతే రేపయినా హార్బర్‌లోకి వెళ్తాయి. తనకా ధీమా ఏది అనుకున్నాడు సుబ్బారావు.

రోజూ కాలేజీకి పది మైళ్ళు సైకిలుతొక్కి వెళ్ళి మరీ చదివాడు తను. ఆర్థికంగా ఎన్ని బాధలుపడినా, కాలేజీకి వెళ్ళాక అవి గుర్తుండేవి కావు. చదువు, స్నేహితులతో కబుర్లు, చర్చలు, ఆటలు, పాటలు, అల్లరి, కవితా పల్లవి. పార్కులో తరచూ తనూ స్నేహలత మధురోహల పల్లకిలో విహరించడం సుబ్బారావు మనసులో మెదిలింది. ఇద్దరు కథల గురించీ, నవలల గురించీ, సినిమాల గురించీ తెగమాట్లాడుకునేవారు. చదువయ్యాక పెళ్ళి చేసుకుందామనుకున్నారు. 'ఏదయినా ఉద్యోగం దొరికాక పెళ్ళి చేసుకుంటాను

నిన్ను అని' తన స్నేహలతకు మాటిచ్చాడు. స్నేహలత తనకోసం అయిదేళ్ళు ఎదురుచూసింది. తనకు ఉద్యోగం రాలేదు. తప్పనిసరి పరిస్థితులలో పెద్దల బలవంతంతో స్నేహలత మరొకడ్ని వివాహం చేసుకుంది. ఇప్పుడామె ఓ పిల్ల తల్లయ్యింది కూడా. సుబ్బారావుకు తనమీద తనకే జాలి కలిగింది.

సుబ్బారావు బీచీలో కూర్చున్నాడు. చిరుఎండ సముద్రంపైపడి మెరుస్తోంది. కలల్లాగే అలలు ఒడ్డుకొచ్చి, వెనుదిరిగి మాయమై పోతున్నాయి. కింద ఇసుక వేడిగా వుంది. సుబ్బారావు లేచి నిలబడ్డాడు. జేబులో డబ్బులెన్నివున్నాయో చూసుకున్నాడు. క్వాలిటీ వైపు నడిచాడు. కాఫీ తాగాడు. తనకు ఎదురుగా కూర్చున్నతను సిగరెట్ కాల్చడం చూసి తనూ కాలుద్దామనుకున్నాడు. 'ఇదివరకెప్పుడూ తను సిగరెట్టు తాగలేదు. ఎలాగూ ఇవేళ చచ్చిపోతాను. ఇంతమందీ ఇంతిదిగా సిగరెట్లు ఎందుకు కాలుస్తున్నారో మనమూ ఒకటి కాల్చిచూద్దాం' అనుకుని కిళ్ళీ బడ్డీ దగ్గరకెళ్ళాడు. ఓ సిగరెట్ కొని, నిప్పుముట్టించి గట్టిగా దమ్ములాగాడు. దగ్గు వచ్చింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నోరు చేదుగా అనిపించింది. సుబ్బారావు అక్కడ నుంచి నడిచివెళ్ళి ఇసుకమీద కూర్చున్నాడు. ఇప్పుడు ఇసక ఇందాకటంత వేడిగా లేదు.

ఒడ్డును చేరడానికి సముద్ర కెరటాలు ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నాయి. ఉద్యోగాలకు పోటీ ఉద్యోగం వచ్చాన ప్రమోషన్ల కోసం పోటీ. ఈ పోటీలలో నెగ్గి నవారికి జీవితం వడ్డించిన విస్తరి. తనలాంటి వాడి బతుకు అతుకుల బొంత. కరువుల సంత. సుబ్బారావు మెదడు ఒడ్డును ఆలోచన కెరటాలు కోసేస్తున్నాయి.

చచ్చిపోయాక మనుషులేమవుతారు? తను స్వర్గానికెళ్తాడా? నరకానికెళ్తాడా? మంచి పనులు చేసినవాళ్ళు స్వర్గానికెళ్తారట. చెడ్డ పనులు చేసిన వాళ్లు నరకానికెళ్తారట. అలాగని చిన్నప్పుడు నాన్న చెప్పాడు. కానీ, నరకం ఎక్కడో కాదు ఇక్కడే వుంది. ఈ భూమిమీదే వుంది. నరకం ఇక్కడున్నప్పుడు స్వర్గం కూడా ఇక్కడు వుండాలి కదా. అంచేత మంచిచేసినా తనలాంటి వాళ్ళకు ఇక్కడే నరకం చెడు చేసినా సుఖించే వాళ్ళకు ఇక్కడే స్వర్గం. స్వర్గ నరకాలు ఎక్కడో లేవు. ఇక్కడేవున్నాయి. ఆకలి పెనం మీద కొందరు ఇక్కడే మాడిపోతారు. సుఖాల సింహాసనం మీద మరికొందరు యిక్కడే తేలిపోతారు. స్నేహలత నన్నెప్పుడయినా తలచుకుంటుందా? నేను ఆమెకు గుర్తుంటానా?సుఖాల తీరంలో బతుకుతూ వుండివుంటే నేను ఆమెకు అసలు జ్ఞాపకమే రాకపోవచ్చు. కష్టాల కడలిలో మునుగుతూ వుండివుంటే నేను ఆమెకు గుర్తుకు రావచ్చు. అయినా కొన్ని గంటలలో నేను చచ్చిపోబోతున్నాను. స్నేహలతకు నేను గుర్తువున్నా గుర్తుకురాకున్నా ఏం ఫర్వాలేదు. ఈ ధూర్త లోకంతో తెగతెంపులు చేసుకోబోతున్నాను. ఇక ఇంటర్వ్యూల కోసం ఎదురు చూడనక్కరలేదు. అప్పో, సప్పో చేసి వూళ్ళు తిరగనవసరం లేదు. ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడనక్కరలేదు. సుబ్బారావు సముద్రం కేసి చూశాడు. చుట్టూవున్న జనం కేసి చూశాడు.

చిరుచీకట్లు ముసురుకుంటున్నాయి. వీళ్ళంతా యిక్కడ నుంచి ఎప్పటికి వెళ్ళిపోతారో? వీళ్ళు వెళ్ళిపోయాక, తను సముద్రంలోకి నడుస్తాడు. కళ్ళు మూసుకుని నీటిలోపలికి, ఈ లోకం ఆవలికి తను నడిచి వెళ్ళిపోతాడు. సుబ్బారావు ఆత్మహత్య అనే శీర్షికతో పేపర్లో వేస్తారేమో? వేస్తే కొందరు చదివి అయ్యోపాపం అనుకుంటారు. అంతే ఆ తర్వాత తను ఎవరికీ గుర్తుండడు. లేదు నాన్నకి మాత్రం గుర్తుంటాడు. 'పెంచి పెద్దచేసినందుకు ఇదట్రా నాకిచ్చిన బహుమతి' అని నాన్న ఏడుస్తాడు. తను పోతే ముసలినాన్న ఎలా బతుకుతాడో, నేను పోయాక ఎవరు ఎలా బతికితే తనకేమిటి? ఆలోచిస్తే ఇదేతంటా, ఎక్కడలేని విషయాలూ బుర్రలోకి వచ్చేస్తాయి. ఈ జనం ఇప్పట్లో కదిలేలా లేరు. వీళ్ళంతా నా గురించే ఆగినట్టున్నారు. సుబ్బారావుకు జనంమీద కోపం వచ్చింది. చిరాకేసింది.

సుబ్బారావుకు అంతలో గుర్తొచ్చింది. తను సముద్రంలోపడి చద్దామనుకున్నాడు కదా. ఎలా కుదురుతుంది? తనకు ఈత బాగావచ్చును. తీరా నేల కాళ్ళకందనంతదూరం వెళ్ళాక, ఈతకొట్టి ఒడ్డుకొచ్చేద్దామనిపిస్తే? అబ్బే సముద్రం లాభం లేదు. మరో మార్గం చూసుకోవాల్సిందే. నిద్ర మాత్రలయితే హాయట. కానీ డాక్టర్ చీటీ లేకుండా ఎవడిస్తాడు? ఇదీ లాభం లేదు. రైలు కిందపడిచస్తే? గుడ్ ఇది బాగుంది. ఇంక ఈ గోల సముద్రాన్ని చూస్తూ ఇక్కడ కూర్చోడం శుద్ధ దండగ. సుబ్బారావు లేచాడు. బట్టలు దులుపుకున్నాడు.

సుబ్బారావు రోడ్డుమీదకొచ్చాడు. రెండడుగులు వేశాడు. ఆఖరిసారి బస్సెక్కుదాం అనుకుని వెనక్కివచ్చాడు. కొంతసేపటికి పోస్టాఫీసు కెళ్ళే బస్సొచ్చింది. తొక్కిసలాట. ఎలాగైతేనేం సుబ్బారావు బస్సెక్కాడు. సీటు కోసం ఎవరో దెబ్బలాడుకోడం మొదలెట్టారు. నువ్వెంతంటే నువ్వెంత అనుకున్నారు. ఒకరినొకరు కొట్టుకోడానికి చేతులెత్తారు. 'మీరిలాగే దెబ్బలాడుకోండి, నేను మాత్రం అక్కడ కూర్చుంటాను' అని సుబ్బారావు ఆ సీటులో కూర్చున్నాడు. జనం నవ్వారు దెబ్బలాటమాని వాళ్ళిద్దరూ తెల్లబోయారు. సుబ్బారావు పూర్ణ మార్కెట్ దగ్గర బస్ దిగాడు. చావుల మదుం వైపు వెళ్ళే రోడ్డు ఎక్కాడు. కిళ్ళీ బడ్డీ దగ్గరకెళ్ళి, ఓ సోడా తాగాడు. సముద్రంలోని అలలు రకరకాల రంగు రంగుల బట్టలేసుకుంటే ఇక్కడి జనంలాగే వుంటాయి. కరెంటు దీపాలు డ్యూటీ ఎక్కాయి. జనం హడావుడి, పళ్ళ దుకాణాల దగ్గర జనం, రెడీమేడ్ బట్టల దుకాణం దగ్గర జనం, మిఠాయి దుకాణం దగ్గర జనం, చీపురు కట్టలు, చేంతాడులు అమ్మే కొట్టు దగ్గర జనం, ఈ లోకం అమ్మడానికీ, కొనడానికీ మాత్రమే ఉన్నట్టు అనిపించింది సుబ్బారావుకు. నడుస్తున్న వాడల్లా సుబ్బారావు అకస్మాత్తుగా ఆగిపోయాడు. రెప్పలు వేయకుండా చూస్తుండిపోయాడు.

ఓ కిళ్ళీ బడ్డీకి దగ్గరగా రోడ్డుపక్క ప్రత్యేకంగా తయారు చేసిన నాలుగు చక్రాల బండి వుంది. దాని పక్కనే నేలమీద పరిచిన చిన్న గుడ్డమీద ఓ ముప్పై సంవత్సరాల బిచ్చగాడు పడుకున్నాడు. కూర్చోడానికి వీలులేకనే అతనలా పడుకున్నాడు. అతనికి

కాళ్ళు లేవు, చేతులు లేవు. నాలుగడుగుల పొడవున్నాడు. వాడి ముందు చిల్లర డబ్బులున్నాయి. అటు వైపు వచ్చినవాళ్ళు అయిదు పైసలో, పది పైసలో వేస్తున్నారు. సుబ్బారావులో ఆలోచనల తుఫాన్ రేగింది. ఆలోచిస్తూ ఆ ముష్టి వాణ్ని చూస్తూ నిలబడ్డాడు.

కాళ్ళూ చేతులూ లేని బిచ్చగాడు బండికి అతి దగ్గరగా దొర్లాడు. వీపు బండికి ఆన్చాడు. బండికి వున్న చిన్న కమ్మిపైకి నెమ్మదిగా జరగడం మొదలెట్టాడు. అయిదు నిమిషాలకు నడుం వరకు పైకి జరిగాడు. పాపం వీడు యిలా ఎప్పటికి బండెక్కగలడు, కాస్త సాయం చేద్దాం అనుకున్నాడు సుబ్బారావు. ముష్టివాడ్ని బండెక్కించడానికి సుబ్బారావు కొద్దిగా ముందుకు వంగాడు. అంతలో 'సార్ మీరేం చేయకండి, ఆడికి చాలా కోపం వస్తాది. రోజూ ఈ బండిని నేనే లాక్కెల్తాను. అయితే బండిమాత్రం ఆడే ఎక్కుతాడు. ఆడే దిగుతాడు. ఓసారి నేనిలాగే సాయం చేయబోతే నన్ను బండబూతులు తిట్టాడు. నేనీమాత్రం సేయలేననుకున్నావేట్రా కుర్ర నాకొడకా అని తిట్టాడు. అంచేత మీరేం కలగజేసుకోకండి' అని అన్నాడు అక్కడేవున్న పన్నెండేళ్ల కుర్రవాడు సుబ్బారావు గబుక్కున నిలబడ్డాడు. చాచిన అతని చేతులు అసంకల్పితంగా వెనక్కువచ్చేశాయి. మరో అయిదు నిమిషాలకు ముష్టివాడు బండెక్కేశాడు. పడుకునే ఆయాసం తీర్చుకుంటున్నాడు.

సుబ్బారావులో చలనం వచ్చింది. తన నిర్ణయం తలచుకుని సిగ్గుపడిపోయాడు. ఆ ముష్టివాడికి చదువులేదు. తనకు వుంది. వాడికి కాళ్ళూ చేతులూ లేవు. తనకున్నాయి. కానీ, తనెంత పిరికివాడు? తనెంత అవివేకి? ఆ ముష్టివాడు తనొక్కడే బతకడం లేదు తను బతుకుతూ, అందుకోసం రోజూ పోరాటం చేస్తూ అందర్నీ తన బతుకును చూసి బతకమని సందేశం యిస్తున్నాడు. నిజం– వాడు బతుకును బతికిస్తున్నాడు. ముష్టివాడి బండిని కుర్రోడు లాక్కుంటూ ముందుకెళ్ళి పోయాడు. బండి కనిపించేవరకూ సుబ్బారావు అలాగే చూస్తుండిపోయాడు.

కళ్ళు మూసుకున్నాడు సుబ్బారావు. అతని కళ్ళముందు కాంతిపుంజాలు, రంగురంగుల పూలు, పరిమళాలు వెదజల్లుతూ ప్రేమగా సుబ్బారావు ఒళ్ళు నిమురుతూ చల్లగాలి, అతను కళ్ళు తెరిచాడు. పైకి చూశాడు. చంద్రుడు వేడెక్కిన నగరం ఒంటికి చల్లని వెన్నెల వెన్నను మర్దనా చేస్తున్నాడు. "ఇందాకటి సూర్యుడి వెచ్చని ఎర్రని ఎండ నా కోసం. ఇప్పటి చంద్రుడి తెల్లని చల్లని వెన్నెల నా కోసం. నాన్నను యిక శ్రమపడనీయను. ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ కూర్చోను. ఎంత చిన్నపని అయినా సరే చేస్తాను" అవును, నేను చచ్చిపోను, అనుకున్నాడు సుబ్బారావు.

*1984, ఆగష్టు 1–15, వాణి పక్షపత్రిక*

*(ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం నుంచి ప్రసారం)*